నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 29 డిసెంబర్ 2023 | SURYAPET

అధ్యయనోత్సవాలు పరిపూర్ణం

- ఆరు రోజులుగా అత్యంత వైభవంగా అలంకార సేవలు

యాదగిరిగుట్ట తిరువీధుల్లో స్వామివారి ఊరేగింపు

యాదగిరిగుట్ట, డిసెంబర్28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో ఈ నెల 23న ప్రారంభమైన ఆధ్యయనోత్సవాలు గురువారం పరిపూర్ణమయ్యాయి. నిత్యారాధనలు అనంతరం లక్ష్మీనరసింహ స్వామిని అలంకరించి ఆళ్వారుల ముందు ప్రబంధ పారాయణాలను పఠించి, భక్తుల దర్శనార్థం తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు తిరుమంజన, నవకలశ స్నపన మహోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు పాంచరాత్రగమ సంప్రదాయ రీతిలో వైభవంగా జరిపారు. అనంతరం అధ్యయనోత్సవాలకు విచ్చేసిన దివ్య ప్రబంధ పారాయణికులను ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా గుట్ట ప్రధానాలయంలో తిరుప్పావై పూజలను వైభవంగా చేపట్టారు. గోదాదేవి శ్రీరంగనాయకుడిపై రచించిన పాశురాలను అర్చకులు పఠించారు.

సురేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిశోర్

బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాల దాడి

దుర్మార్గమైన చర్య

- ఘర్షణలు తెలంగాణ సమాజానికి మంచిది కాదు
- సురేశ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- జిల్లా మంత్రులు దీనిపై చొరవ తీసుకోవాలి
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- చికిత్స పొందుతున్న సురేశ్‌కు పరామర్శ

సూర్యాపేట, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలు జరిగి నెల రోజులు కూడా అవకముందే ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాలు దాడులకు పాల్పడడం దుర్మార్గమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఆదర్శ రైతు, కేసీఆర్ వీరాభిమాని అయిన మెండె సురేశ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు జరిపిన దాడిని తీవ్రంగా ఖండించారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేశ్‌ను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఇరువురు నేతలు ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగదీశ్‌రెడ్డి ఘర్షణలు తెలంగాణ సమాజానికి మంచిది కాదన్నారు. రాజకీయ తగాదాలతో గ్రామాలు వల్లకాడులైన గత చరిత్ర నల్లగొండ జిల్లాది అని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాజకీయ ఘర్షణలకు తావు లేకుండా చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో రాజకీయ దాడులను ఆపాల్సిన బాధ్యత జిల్లా మంత్రులది, పోలీసు అధికారులదేనని చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులు ఇలాంటి చిల్లరవాటికి ఆవేశానికి లోనుకావద్దని కోరారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీలు జీడి భిక్షం, దావుల విరప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్ ఉన్నారు.

స్థానిక ప్రజా ప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా ?

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం స్థానిక సంస్థలకు కనీస గౌరవం ఇవ్వలేదని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో చేపడుతున్న కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని చెప్పి, ఆ కార్యక్రమాన్ని రద్దు చేయడమే దానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామన్నారని, కానీ నేడు వాటికి గౌరవం ఇవ్వడం లేదని తెలిపారు. మరోవైపు ప్రజాపాలన సభల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీ పథకాలు అమలయ్యేలా, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ప్రజా పాలనకు శ్రీకారం

ఆరు గ్యారెంటీ స్కీముల కోసం దరఖాస్తులు షురూ

- గ్రామానికి రెండు నుంచి నాలుగు కౌంటర్ల ఏర్పాటు
- హెల్ప్ డెస్క్, మహిళలకు ప్రత్యేక కేంద్రాలు
- ప్రజలకు అవగాహన, ప్రచారం కల్పించని యంత్రాంగం
- దరఖాస్తులకు జనం నుంచి స్పందన అంతంతే..
- పలుచోట్ల దరఖాస్తు ఫారాలు లేక వెనుదిరిగిన ప్రజలు
- ఆయా నియోజకవర్గాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు

సూర్యాపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

నల్లగొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సూర్యాపేట, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ)/ నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరు గ్యారెంటీల పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ షురూ అయ్యింది. గురువారం నుంచి ఆయా గ్రామాల్లో పథకాల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలి రోజు కావడంతో ప్రజల నుంచి పెద్దగా స్పందన లేదు. కౌంటర్ల వద్ద రద్దీ కనిపించలేదు. దరఖాస్తుల స్వీకరణపై ప్రచార లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 11,132, సూర్యాపేట జిల్లాలో 8,809 దరఖాస్తులు వచ్చాయి.

సమాచారం లేక రాని జనం

నల్లగొండ జిల్లాలోని 844 గ్రామ పంచాయతీలకు గానూ 118 గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరించారు. నల్లగొండ మున్సిపాలిటీలోని అన్ని వార్డులతో పాటు జిల్లాలోని మిగిలిన మున్సిపాలిటీల్లో 23 వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ జరిగింది. మొత్తంగా ఆయా గ్రామాల్లో 46,428 కుటుంబాలకు ఫారాలు ఇవ్వగా 23,593 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. చాలా చోట్ల అవగాహన కల్పించకపోవడంతో దరఖాస్తులు అందజేయడంలో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొన్ని గ్రామాలకు ఒక్కరోజు ముందే దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని షెడ్యూల్ పెట్టడంతో చాలా మంది తెలియక పనులకు వెళ్లారు. దాంతో పెద్దగా దరఖాస్తులు రాలేదు. మున్సిపాలిటీల్లో దరఖాస్తు దారులు పెద్ద సంఖ్యలో రావడంతో అప్లికేషన్ల కొరత ఏర్పడింది. ఆయా వార్డు ఇన్‌చార్జులు తర్వాత రండి అని పంపించారు.

సూర్యాపేట జిల్లాలో 8,809 దరఖాస్తులు

ప్రజాపాలన కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 110 సెంటర్ల నుంచి 8,809 దరఖాస్తులు వచ్చాయి. 89 గ్రామ పంచాయతీల్లో 6,134, ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 21 వార్డుల నుంచి 2,675 దరఖాస్తులు అందాయి.

అనేక అనుమానాలు

పథకాల కోసం ఎవరు దరఖాస్తు చేసుకోవాలి..? ఇప్పటికే అందుతున్న పింఛన్, రైతుబంధు లాంటి వాటికి మళ్లీ చేసుకోవాలా..? అవసరం లేదా..? అనే విషయాలు తెలియక చాలా మంది తికమక పడ్డారు. ఒకవేళ దరఖాస్తు చేస్తే ఏదో ఒక కొర్రీ పెట్టి తొలగిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మీసేవ, ఆధార్ సెంటర్లు కిటకిట

ఆరు గ్యారెంటీల పథకాల కోసం కావాల్సిన పత్రాలకు జనం మీసేవ సెంటర్లకు పోటెత్తారు. పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో దరఖాస్తు చేసుకునేందుకు బారులు దీరారు. మరోవైపు ఆధార్ సెంటర్లు కూడా రద్దీగా మారాయి. పేర్లు, అడ్రస్‌ల మార్పులు, చేర్పుల కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోజు మొత్తం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డుకు దరఖాస్తులు తీసుకోవడం లేదు. దాంతో మీ సేవ కేంద్రాల్లో ఈ పరిస్థితి ఏర్పడింది.

ఫారాలు లేవన్నారు

రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకుందామని వచ్చిన. కొందరి ఇండ్లల్లోకి తీసుకెళ్లి దరఖాస్తు ఫారాలు ఇచ్చిండ్రంట. మాకు మాత్రం ఇవ్వలేదు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుందామని వస్తే ఫారాలు లేవు. అయిపోయినందున రేపు రమ్మని అంటే వెళ్తున్న.

–వందనపు రంగయ్య, 40వ వార్డు, నల్లగొండ

నార్కట్‌పల్లిలో మీసేవ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న జనం

నల్లగొండలో మీసేవ కేంద్రలో జనం రద్దీ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన జిల్లా నాయకులు

నీలగిరి/ హాలియా, డిసెంబర్ 28 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల తరువాత నల్లగొండ పట్టణంలో జరిగిన పరిస్థితులను వివరించారు. అదేవిధంగా సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కేటీఆర్‌ను కలిశారు. స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పార్టీ అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా వారికి కేటీఆర్ సూచించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్
- నల్లగొండలోని వార్డుల్లో దరఖాస్తుల పరిశీలన

పానగల్‌లోని ఒకటో వార్డులో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ, డిసెంబర్ 28 : ప్రజా సంక్షేమం, అభివృద్ధి, మెరుగైన పాలన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజా పాలన ఉమ్మడి నల్లగొండ జిల్లా నోడల్ ఆఫీసర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం ఐదు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను నల్లగొండ పట్టణంలోని పానగల్‌లో 1వ వార్డు, డైట్ కళాశాలలో 5వ వార్డు, 21వ వార్డులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో ఆయన మాట్లాడారు. దరఖాస్తులను ఎలా నింపాలో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులకు అధికారులు వివరాలు చదివి వినిపించి పథకం వారీగా సరిచూసుకొని నింపాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలతోపాటు అభయ హస్తం గ్యారెంటీ పథకాలు పొందేలా దరఖాస్తుదారులు ఆయా పథకాల ఎదురుగా టిక్ మార్క్ చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకం కింద అర్హులు రూ.2500 ఆర్థిక సాయం దగ్గర టిక్ చేయాలన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ వద్ద టిక్ మార్క్ చేసిన వారు గ్యాస్ కంపెనీ పేరు, నెంబరు, సిలిండర్ల సంఖ్య నమోదు చేయాలని తెలిపారు. రైతు భరోసా పథకంలో భూముల వివరాలు, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు లేనివారు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం వద్ద టిక్ చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారు వివరాలు తెలుపాలని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల గృహ విద్యుత్ వినియోగం వివరాలు, చేయూత పథకంలో పింఛన్ల కోసం ఆయా విభాగం వద్ద టిక్ చేయాలన్నారు. దరఖాస్తులో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు విధిగా రసీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో 48 వార్డుల్లో మున్సిపల్, అంగన్‌వాడీ, మెప్మా, ఆశ వర్కర్లతో 48 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది టీమ్‌లు ప్రత్యేకంగా అన్ని వార్డుల్లో పర్యటిస్తాయన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కూడా దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ చంద్రమోహన్, కౌన్సిలర్లు పున్న గణేశ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

నేరాలు తగ్గుముఖం

- ఈ ఏడాది నల్లగొండ జిల్లాలో తగ్గిన క్రైమ్ రేటు
- జిల్లా వ్యాప్తంగా 132 క్రిమినల్, 7,542 సాధారణ కేసులు నమోదు
- జిల్లా పోలీసుల సమష్టి కృషితో శాసనసభ ఎన్నికలు విజయవంతం
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు.. వాటి నివారణకు ప్రత్యేక చర్యలు

నీలగిరి, డిసెంబర్ 28 : స్వరాష్ట్రంలో ప్రజా సంరక్షణే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో నేరాలు తగ్గుముఖం పట్టాయి. 2022 సంవత్సరంలో 32 రకాలవి 7,874 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 7,674 నమోదయ్యాయి. వ్యక్తిగత హత్యలు, పాత కక్షలు, లైంగిక దాడులు, చీటింగ్ కేసులు చాలా వరకు తగ్గాయి. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్ కేసులు పెరిగినప్పటికి ఐపీసీ సెక్షన్ల కేసులను చాలా వరకు నియంత్రించడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం విజయవంతమైంది.

ప్రశాంతంగా శాసనసభ ఎన్నికలు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాకు ఎన్నికల ప్రచారానికి వచ్చిన ముఖ్యమంత్రితోపాటు అనేక మంది వీవీఐపీలకు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. గ్రామాలను క్లస్టర్ల వారీగా విభజించి శాంతిభద్రతలు పరిరక్షించారు. అభ్యర్థుల నామినేషన్లు, నాయకుల రోడ్ షోలు, సభల నిర్వహణ సమయంలో అవాంఛనీయ సంఘటనలు లేకుండా 3,514 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ ఎన్నికల సందర్భంగా ముందస్తుగా 3,732 మందిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేయడంతోపాటు 177 మంది నుంచి లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేయించారు. 2,187 వాహనాలను తనిఖీ చేసి రూ.50 కోట్ల నగదుతోపాటు లిక్కర్, గంజాయి, ఎన్నికల ప్రలోభాలకు గురిచేసే వస్తువులను సీజ్ చేశారు.

786 రోడ్డు ప్రమాదాల్లో 380 మంది మృతి

ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 786 రోడ్డు ప్రమాదాలు జరుగగా 380 మంది మృతిచెందారు. 8,374 మంది గాయాలపాలయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రమాదానికి గల కారణాలను అన్వేషించి వాటి నిర్మూలనకు కృషి చేశామని జిల్లా పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక లైట్లు, సిగ్నల్స్ ఏర్పాటుతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. పోలీసు ప్రజావాణి నిర్వహించగా.. 2,270 ఫిర్యాదులు వచ్చాయి. వాటినన్నింటినీ పరిష్కరించారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్న నలుగురిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేశారు. భరోసా కేంద్రం ద్వారా 19మంది బాధితులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇప్పించారు. నేరాలను నిరోధించేందుకు జిల్లాలో 6,066 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక రాబరీ, రెండు హత్యాయత్నం, 9 గంజాయి కేసులను గుర్తించారు. వివిధ దొంగతనాల కేసుల్లో 25 తులాల బంగారం, 4.33 కోట్ల రూపాయల నగదు, 10 ఫోర్ వీలర్ వాహనాలు, 4 బైక్‌లు, 116 సెల్ ఫోన్లు రికవరీ చేశారు. 646.5 కిలోల గంజాయి, 15.45 టన్నుల రేషన్ బియ్యం, నకిలీ విత్తనాలను సీజ్ చేశారు.

నాలుగేండ్లలో నమోదైన నేరాల వివరాలు

క్రైం రకం	2020	2021	2022	2023
ప్రతీకార హత్యలు	1	0	0	0
దొంగతనాలు	269	328	503	488
హత్యలు	31	70	39	29
అల్లర్లు	31	17	14	02
కిడ్నాప్‌లు	50	71	66	64
లైంగిక దాడులు	54	95	90	88
దాడులు	976	725	1002	1009
మోసాలు	310	496	484	345
దొంగనోట్లు	1	0	1	0
హత్యాయత్నాలు	62	83	57	56
రోడ్డు ప్రమాదాలు	693	696	1056	786
తప్పిపోయిన కేసులు	350	432	456	507
అగ్ని ప్రమాదాలు	15	9	17	21
ఎస్ఎస్ఎల్ కేసులు	221	279	539	552
ఇతర ఐపీసీ కేసులు	3,690	6,234	3,495	3,700
డోపిడీలు	0	0	1	1
మొత్తం	6,751	9,535	7,874	7,674

ఫుట్‌బాల్ అండర్ -17 తెలంగాణ టీమ్ కెప్టెన్‌గా నల్లగొండ వాసి

- జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించనున్న వెంకటసాయి

ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా ఎంపికైన వెంకటసాయి

నల్లగొండ రూరల్, డిసెంబర్ 28 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -17 బాలుర జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు కెప్టెన్‌గా నల్లగొండ పట్టణానికి చెందిన రాచూరి వెంకటసాయి ఎంపికయ్యాడు. కెప్టెన్‌గా ఎంపికైన వెంకటసాయిని చత్రపతి శివాజీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మపాల గిరిబాబు గురువారం అభినందించి మాట్లాడారు. మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన రాచూరి వెంకటసాయి చత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్ కోచ్ కరుణాకర్ వద్ద శిక్షణ తీసుకున్నాడని తెలిపారు. ఇటీవల జడ్చర్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎస్‌జీఎఫ్ తెలంగాణ జట్టుకు ఎంపిక కావడంతోపాటు రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడన్నారు. వెంకటసాయి ప్రస్తుతం నల్లగొండ ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడని తెలిపారు. కెప్టెన్‌గా ఎంపికైన వెంకటసాయికి పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.